ఐపీఎల్ ముచ్చట్లు

బంతిని మార్చండి మహాప్రభో!

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

బంతికి బ్యాట్‌కు సమానమైన పోరు జరిగితేనే క్రికెట్‌కు అందం! ఆటను చూసేవారికి ఆనందం!! కానీ ఆధునిక క్రికెట్‌లో మాత్రం నిబంధనలు బ్యాటర్లకు అనుకూలంగా ఉన్నాయన్నది బహిరంగ వాస్తవం. ఇక ఐపీఎల్ వంటి మెగా లీగ్‌లో పవర్ ప్లేలు, ఇంపాక్ట్ ప్లేయర్ వంటి నిబంధనలు బౌలర్లకు కాలరాత్రులనే మిగులుస్తున్నాయి. బ్యాటర్ల పరుగుల జాతరకు చరిత్రలో పాత రికార్డులన్నీ కనుమరుగవుతూ బౌలర్లు నిద్రలేని రాత్రులు గడుపుతూ అసలు బౌలింగ్ ఎలా చేయాల్రా దేవుడా..? అంటూ తలలు పట్టుకుంటున్నారు. ఐపీఎల్‌లో 13 ఏండ్ల పాటు పదిలంగా ఉన్న ఆర్సీబీ అత్యధిక స్కోరు (263) రికార్డు తాజా సీజన్‌లో ఏకంగా మూడు సార్లు బ్రేక్ అయిందంటే బ్యాటర్ల బాదుడు ఏ రేంజ్‌లో ఉందనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. ఒకప్పుడు 160, 170 పరుగులు కొడితే గెలవొచ్చు అన్న ధీమాలో జట్లు ఉండగా ఇప్పుడు ప్రత్యర్థి జట్టు ముందు 280 పరుగులు చేసినా గెలుస్తామన్న నమ్మకం లేదంటే బౌలర్లపై బ్యాటర్లు ఏ స్థాయిలో చెలరేగిపోతున్నారనే దానితో పాటు బాల్-బ్యాట్ మధ్య సమమైన పోరు జరుగడం లేదనేది ప్రస్ఫుటమవుతోంది. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో బౌలర్లకు ఇచ్చే 'బంతిని మార్చాలి' అనే ప్రతిపాదన ముందుకు వస్తోంది.

మంగళవారం కోల్‌కతా - రాజస్థాన్ మధ్య ముగిసిన మ్యాచ్‌లో శాంసన్ సేన 224 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన తర్వాత కేకేఆర్ మెంటార్ గౌతం గంభీర్ మాట్లాడుతూ.. ''ఒక బంతి 50 ఓవర్ల పాటు మనుగడ సాగించకుంటే దాని తయారీదారుడిని మార్చడంలో తప్పేముంది. 'కూకబురా'ను అంత బలవంతంగా వాడటంలో ఆంతర్యమేంటి..?'' అని వ్యాఖ్యానించి కొత్త చర్చకు దారి తీశాడు. అంతేగాక ఇంగ్లండ్ టెస్టులలో వాడే 'డ్యూక్' బాల్‌తో ఐపీఎల్ ఆడాలని ప్రతిపాదించాడు. ఇదే విషయమై ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. ఐపీఎల్ కూకబురాతో కాకుండా డ్యూక్ బాల్‌తో ఆడాలని, తద్వారా బ్యాట్-బాల్ మధ్య సమానమైన పోటీ ఉంటుందని హర్షా నొక్కి చెప్పాడు.

సాధారణంగా ఐపీఎల్‌లో బౌలర్లు ఉపయోగించేది కూకబురానే. ఇది ఆస్ట్రేలియాలో తయారవుతుంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే భారత పిచ్‌లపై బౌలర్లకు దీన్నుంచి స్వింగ్, సీమ్‌ను రాబట్టడం అంత తేలిక కాదు. కుకబురాతో పోలిస్తే డ్యూక్ బాల్ స్వింగ్‌కు బాగా అనుకూలిస్తుంది. దీంతో బాల్-బ్యాట్ సమరం రసవత్తరంగా సాగుతుందనేది విశ్లేషకుల వాదన. మరి ఈ ప్రతిపాదనను బీసీసీఐ ఏ మేరకు స్వీకరిస్తుంది..? బంతిని మారుస్తుందా..? బౌలర్లకు మంచిరోజులు వస్తాయా..? అన్నది కాలమే నిర్ణయించాలి.

ఈ సీజన్‌లో బుధవారం నాటికి 32 మ్యాచ్‌లు జరిగితే అందులో పలు జట్లు 200 ప్లస్ స్కోరును ఏకంగా 14 సార్లు నమోదుచేయగా 13 సార్లు 180-199 మధ్య నమోదైందంటే బౌలర్లపై బ్యాటర్ల ఆధిపత్యం ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఢిల్లీ చేతిలో గిల్‌గిల!

89 పరుగులకే టైటాన్స్ ఆలౌట్ • రాణించిన ఢిల్లీ పేసర్లు • క్యాపిటల్స్ ఏకపక్ష విజయం

భారీ స్కోర్లు నమోదవుతున్న ఐపీఎల్-17లో తొలిసారిగా ఓ జట్టు 100 పరుగులలోపే చిత్తైంది. అహ్మదాబాద్‌లో మ్యాచ్ అంటే ప్రత్యర్థి ఎవరన్నదీ చూడకుండా వీరబాదుడు బాదే గుజరాత్ టైటాన్స్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ ఊహించని షాకిచ్చింది. తమ బౌలింగ్‌తో చుక్కలు చూపించి టైటాన్స్‌ను 89 పరుగులకే కట్టడిచేసింది. వెటరన్ పేసర్ ఇషాంత్ శర్మ, ముకేశ్ కుమార్‌లు పేస్‌తో గుజరాత్‌ను వణికించగా వికెట్ల వెనుక పంత్ అద్భుత వికెట్ కీపింగ్ నైపుణ్యంతో ఆకట్టుకోవడంతో గిల్ సేన ఈ లీగ్‌లో తొలిసారిగా వందపరుగుల కంటే తక్కువ స్కోరుకు పరిమితమైంది. స్వల్ప ఛేదనను ఢిల్లీ 8.5 ఓవర్లలోనే ఊదేసింది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో ఆ జట్టు 9వ స్థానం నుంచి ఏకంగా మూడు స్థానాలు మెరుగుపరుచుకుని ఆరో స్థానానికి రావడం విశేషం. గుజరాత్ నాలుగో ఓటమితో ఏడో స్థానానికి పడిపోయింది.

పంత్ సూపర్ కీపింగ్

రోడ్డు ప్రమాదంలో చావు అంచుల వరకూ వెళ్లి సుమారు ఏడాదిన్నర పాటు ఆటకు దూరమైన రిషభ్ పంత్ ఈ సీజన్‌లో రీఎంట్రీ ఇచ్చి బ్యాట్‌తో దుమ్మురేపుతున్నా గుజరాత్‌తో మ్యాచ్‌లో మాత్రం అతడి వికెట్ కీపింగ్.. మునపటి పంత్‌ను గుర్తుకు తెచ్చింది. గుజరాత్ బ్యాటర్లలో నలుగురిని పెవిలియన్‌కు పంపడంలో అతడు కీలకపాత్ర పోషించాడు. మిల్లర్ క్యాచ్‌ను పంత్ ఎడమవైపు డైవ్ చేస్తూ ఒంటిచేత్తో అద్భుతంగా అందుకున్నాడు. స్టబ్స్ వేసిన 9వ ఓవర్లో అయితే రెప్పపాటు వ్యవధిలోనే రెండు అదిరిపోయే స్టంపౌట్స్‌తో గుజరాత్‌ను దెబ్బకొట్టాడు. అభినవ్ మనోహర్, షారుక్ ఖాన్‌ల స్టంపౌట్స్ ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచాయి. రీఎంట్రీ తర్వాత పంత్ ఎలా రాణిస్తాడన్నదానిపై అనుమానాలు తొలిగిపోయినా గుజరాత్‌తో మ్యాచ్‌లో అతడి వికెట్ కీపింగ్ విన్యాసాలు ప్రేక్షకులను అలరించాయి. పంత్ ఇదే పట్టుదలతో ఆడితే రాబోయే టీ20 ప్రపంచకప్‌లో అతడికి చోటు దక్కడం ఖాయమే!

అహ్మదాబాద్: ఐపీఎల్-17లో పడుతూ లేస్తూ వస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా రెండో విజయం కొట్టింది. ఇటీవలే లక్నోను వారి సొంత ఇలాఖాలో చిత్తుచేసిన రిషభ్ పంత్ సేన.. తాజాగా అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌కు అవమానకరమైన ఓటమిని రుచి చూపించింది. ఢిల్లీ బౌలర్ల విజృంభణతో నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో గుజరాత్.. 17.3 ఓవర్లలో 89 పరుగులకే పరిమితమైంది. రషీద్ ఖాన్ (24 బంతుల్లో 31, 2 ఫోర్లు, 1 సిక్సర్) ఆ జట్టులో టాప్ స్కోరర్ కాగా ఏకంగా 8 మంది సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో ముకేశ్ (3/14), ఇషాంత్ శర్మ (2/8)లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. స్వల్ప ఛేదనను ఢిల్లీ 8.5 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జేక్ ఫ్రేజర్ (10 బంతుల్లో 20, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపులు మెరిపించాడు. అద్భుతమైన వికెట్ కీపింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ రాణించిన రిషభ్ పంత్ (11 బంతుల్లో 16 నాటౌట్, 1 ఫోర్, 1 సిక్స్)కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

గుజరాత్ పేలవ బ్యాటింగ్..

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన గుజరాత్‌కు ఆరంభం నుంచే కష్టాలు చుట్టుముట్టాయి. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (6) ఇషాంత్ శర్మ బౌలింగ్‌లో కవర్స్ వద్ద పృథ్వీ షాకు క్యాచ్ ఇచ్చాడు. అహ్మదాబాద్‌లో ఆడిన 16 ఐపీఎల్‌లో ఇన్నింగ్స్‌లో సింగిల్ డిజిట్‌కు ఔట్ అవడం అతడికి ఇది మూడోసారి మత్రమే. నాలుగో ఓవర్‌లో ముకేశ్.. వృద్ధిమాన్ సాహా (2)ను క్లీన్‌బౌల్డ్ చేసి మరో దెబ్బకొట్టాడు. ఐదో ఓవర్లో గుజరాత్‌కు డబుల్ షాకులు తాకాయి. గిల్ స్థానంలో వచ్చిన సాయి సుదర్శన్.. రెండు ఫోర్లు కొట్టినా ఐదో ఓవర్లో మొదటి బంతికే దురదృష్టవశాత్తూ రనౌట్ అవగా గుజరాత్ భారీ ఆశలు పెట్టుకున్న డేవిడ్ మిల్లర్ (2) రిషభ్ పంత్‌కు క్యాచ్ ఇవ్వడంతో ఆ జట్టు నాలుగో వికెట్ కోల్పోయింది. పవర్ ప్లే ముగిసేసరికి ఆ జట్టు స్కోరు 30-4.

నత్తకు నడక నేర్చినట్టు సాగిన గుజరాత్ ఇన్నింగ్స్‌ను ట్రిస్టన్ స్టబ్స్ 9వ ఓవర్లో కోలుకోనీయకుండా చేశాడు. ఆ ఓవర్లో అభినవ్ మనోహర్ (8)తో పాటు షారుక్ ఖాన్ (0)ను పంత్ సూపర్ స్టంపింగ్‌తో పెవిలియన్‌కు పంపాడు. రాహుల్ తెవాటియా (10)ను అక్షర్ పటేల్ వికెట్ల ముందు బలిగొన్నాడు. గుజరాత్ తరపున 17వ ఓవర్లో తొలి సిక్సర్ కొట్టిన ఆ జట్టు టాప్ స్కోరర్ రషీద్ ఖాన్‌ను మరుసటి ఓవర్లో ముకేశ్ ఔట్ చేశాడు. నూర్ అహ్మద్‌ను బౌల్డ్ చేసిన ముకేశ్ గుజరాత్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

8.5 ఓవర్లలోనే..

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఢిల్లీ కూడా తడబడినా వేగంగా మ్యాచ్‌ను పూర్తిచేసింది. పృథ్వీ షా (7) విఫలమైనా గత మ్యాచ్‌లో అర్ధ సెంచరీతో రాణించిన ఆసీస్ కుర్రాడు జేక్ ఫ్రేసర్.. ధాటిగా ఆడాడు. పది బంతుల్లోనే రెండు పోర్లు, రెండు సిక్సర్లతో 20 పరుగులు చేశాడు. స్పెన్సర్ జాన్సన్ అతడిని ఔట్ చేశాడు. అభిషేక్ పొరెల్ (7 బంతుల్లో 15, 2 ఫోర్లు, 1 సిక్సర్)ను సందీప్ వారియర్ బౌల్డ్ చేయగా.. రెండు సిక్సర్లు కొట్టిన షై హోప్ కూడా రషీద్ ఖాన్ బౌలింగ్‌లో మోహిత్ శర్మకు క్యాచ్ ఇచ్చాడు. అయితే రిషభ్ పంత్, సుమిత్ కుమార్ ఢిల్లీ మరో వికెట్ కోల్పోకుండా మ్యాచ్‌ను ముగించారు.

1 ఐపీఎల్‌లో మూడో సీజన్ ఆడుతున్న గుజరాత్ జెయింట్స్ వంద లోపు ఆలౌట్ అవడం ఇదే తొలిసారి. ఆ జట్టుకు ఈ లీగ్‌లో ఇదే అత్యల్ప స్కోరు. అంతకు ముందు కూడా ఢిల్లీపై 125 పరుగులకు పరిమితమైంది.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్ : 17.3 ఓవర్లలో 89 (రషీద్ ఖాన్ 31, సాయి 12, ముకేశ్ 3/14, ఇషాంత్ 2/8), **ఢిల్లీ** : 8.5 ఓవర్లలో 92/4 (జేక్ ఫ్రేజర్ 20, షై హోప్ 19, సందీప్ 2/40, రషీద్ 1/12)

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
రాజస్థాన్	7	6	1	0.67	12
కోల్‌కతా	6	4	2	1.39	8
చెన్నై	6	4	2	0.72	8
హైదరాబాద్	6	4	2	0.50	8
లక్నో	6	3	3	0.03	6
ఢిల్లీ	7	3	4	-0.07	6
గుజరాత్	7	3	4	-1.30	6
పంజాబ్	6	2	4	-0.21	4
ముంబై	6	2	4	-0.23	4
బెంగళూరు	7	1	6	-1.18	2

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

పారా ఆర్చర్ శీతల్ దేవి సంచలనం

- ఖేలో ఇండియా గేమ్స్‌లో రజతం

ఢిల్లీ: చేతులు లేకున్నా ఆర్చరీలో సంచలన విజయాలతో పతకాల పంట పండిస్తున్న పారా ఆర్చర్ శీతల్ దేవి శారీరకంగా అన్ని అవయవాలూ సక్రమంగా ఉండి పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్న ఆర్చర్లతో పోటీపడటమే గాక పతకం కూడా నెగ్గి ఔరా అనిపించింది. ఢిల్లీలోని యమునా స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా జరుగుతున్న ఖేలో ఇండియా ఎన్‌టీపీసీ నేషనల్ ర్యాంకింగ్ ఆర్చరీ మీట్‌లో పాల్గొన్న శీతల్.. రెండో స్థానంలో నిలిచి రజతం గెలిచింది. 17 ఏండ్ల శీతల్.. వ్యక్తిగత కంపౌండ్ ఈవెంట్ ఫైనల్‌లో రజతం సాధించింది. జూనియరల్ వరల్డ్ చాంపియన్ ఏక్తా రాణి అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం గెలుచుకుంది. గతేడాది హాంగ్జౌ వేదికగా ముగిసిన ఆసియా పారా గేమ్స్‌లో రెండు స్వర్ణాలు, ఒక రజతం గెలిచిన విషయం తెలిసిందే.

కీలకదశకు క్యాండిడేట్స్ చెస్ టోర్నీ

టోరంటో: కెనడాలోని టొరంటో వేదికగా జరుగుతున్న క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భాగంగా టైటిల్ రేసులో ఉన్న భారత గ్రాండ్‌మాస్టర్లు కీలక పోరుకు సిద్ధమవుతున్నారు. గురువారం జరుగబోయే 11వ రౌండ్‌లో గుకేశ్.. టాప్ సీడ్ ఫాబియానోతో తలపడనుండగా ప్రజ్ఞానంద.. హికారుతో ఆడనున్నాడు. టైటిల్ రేసులో ఉన్న ఈ ఇద్దరికీ 11వ రౌండ్ కీలకం కానుంది. ఈ టోర్నీలో ఇంతవరకూ ఓటమన్నదే లేకుండా సాగుతున్న రష్యా ఆటగాడు ఇయాన్ నెపొనియాచితో విదిత్ ఆడనున్నాడు. మరో నాలుగు రౌండ్లు మాత్రమే మిగిలున్న ఈ టోర్నీలో పది రౌండ్లు ముగిసేసరికి దొమ్మరాజు గుకేశ్, నెపొనియాచిలు ఆరు పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. 5.5 పాయింట్లతో ప్రజ్ఞానంద, హికారు నకమురా, ఫాబియానో మూడు, నాలుగు, ఐదో స్థానాల్లో నిలవగా ఐదు పాయింట్లతో విదిత్ గుజరాతి ఆరో స్థానంలో ఉన్నాడు.

గ్రూప్ దశలోనే వెనుదిరిగిన శ్రీజ, మనికా

- ఐటీటీఎఫ్ వరల్డ్ కప్

మకావు: చైనాలోని మకావు వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) వరల్డ్ కప్‌లో భారత స్టార్ టేబుల్ టెన్నిస్ ఆటగాళ్లు శ్రీజ ఆకుల, మనికా బాత్రాలు గ్రూప్ దశలోనే వెనుదిరిగారు. బుధవారం ఇక్కడ జరిగిన గ్రూప్ దశ రెండో రౌండ్‌లో ప్రపంచ 39వ ర్యాంకర్ శ్రీజ 1-3 (4-11, 4-11, 15-13, 2-11) తేడాతో నాలుగో ర్యాంకర్ అయిన చైనా అమ్మాయి చెన్ మెంగ్ చేతిలో ఓడింది. మనికా 0-4 (6-11, 4-11, 9-11, 4-11) తేడాతో చైనాకే చెందిన ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ మన్యు చేతిలో చిత్తైంది.

టెస్లా రాష్ట్రానికొచ్చేనా?

గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి తీవ్ర పోటీ • గతంలోనే టెస్లా ప్రతినిధులతో కేటీఆర్ చర్చలు • నేడు పట్టించుకోని తెలంగాణ సర్కారు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): టెస్లా విద్యుత్తు ఆధారిత కార్ల తయారీ పరిశ్రమను రాబట్టేందుకు రాష్ట్రాల మధ్య తీవ్ర పోటీ నెలకున్నది. ఈ రేసులో గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడుకు ఇప్పుడు రాజస్థాన్ కూడా తోడైంది. నిజానికి అమెరికాకు చెందిన టెస్లా సంస్థ.. భారత్‌లో పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు 2-3 ఏండ్లుగా ప్రయత్నిస్తున్నది. దీంతో తెలంగాణకు రప్పించేందుకు అప్పటి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఎంతో ప్రయత్నించారు. అమెరికాలో ఆ కంపెనీకి చెందిన ప్రతినిధులతో సమావేశమై రాష్ట్రంలో పరిశ్రమ ఏర్పాటుకున్న అనుకూలతలను వివరించారు. అయితే కేంద్ర ప్రభుత్వ నిబంధనల కారణంగా అప్పట్లో వెనుకాడిన టెస్లా.. ఇప్పుడు దేశంలో అనువైన ప్రాంతాన్ని అన్వేషిస్తున్నది. ఆ సంస్థ అధినాయకత్వం భారత్‌లో పర్యటిస్తున్నది. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు ఏ ప్రయత్నమూ చేస్తున్న దాఖలాలు కానరావడంలేదు. ఎలక్ట్రిక్ కార్ల ఉత్పత్తిలో టెస్లాకు ప్రత్యేక స్థానం ఉన్న విషయం తెలిసిందే. ఈ మధ్య కాలంలో చైనాకు చెందిన కొన్ని కంపెనీలు పోటీ ఇస్తున్నప్పటికీ.. టెస్లాకు ఆదరణ తగ్గడం లేదనే చెప్పవచ్చు. అయితే ప్రస్తుతం టెస్లా కంపెనీ భారత్ కేంద్రంగా ఉత్పత్తిని ప్రారంభించాలని నిర్ణయించింది. 3 బిలియన్ డాలర్లతో ఎలక్ట్రిక్ వాహనాల ప్లాంట్‌ను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించినట్టు, ఇందులో భాగంగా ముందు 500 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4150కోట్లు)తో వచ్చే మూడేండ్లలో వాహనాల తయారీ పరిశ్రమను నెలకొల్పాలని నిర్ణయించినట్టు కంపెనీ వర్గాలు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో టెస్లా యాజమాన్యాన్ని ఆకర్షించేందుకు ఆయా రాష్ట్రాలు పోటీపడుతున్నాయి. గత వారం రాజస్థాన్‌కు చెందిన అధికారుల బృందమొకటి టెస్లా ప్రతినిధులతో సమావేశమై పరిశ్రమ ఏర్పాటుకు భివాడీ, సాలార్‌పూర్, ఖుష్‌ఖేరా ఇండస్ట్రియల్ జోన్లను సూచించినట్టు తెలుస్తున్నది. ఈ ప్రాంతాలు ప్రస్తుతం ఆటో హబ్‌గా రూపొందుతున్నట్టు, ఢిల్లీ-జైపూర్ ఎక్స్‌ప్రెస్‌వేకి ఆనుకొని ఉంటుందని, ఢిల్లీ-ముంబై మార్గానికీ సమీపంలో ఉంటుందని వారు చెప్పినట్టు చెప్తున్నారు. సరసమైన ధరలకే భూములు కేటాయిస్తామని కూడా టెస్లాకు రాజస్థాన్ ప్రభుత్వం ఆఫర్ ఇచ్చిందంటున్నారు.

మూడో అతిపెద్ద మార్కెట్‌గా..

ఆటో రంగంలో 2026 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించనుందని మార్కెట్ వర్గాల అంచనా. ఇప్పటికే ప్యాసింజర్, కమర్షియల్ వాహనాలు, టూవీలర్లు దేశీయంగా జోరుగానే ఉత్పత్తి అవుతున్నాయి. గుజరాత్‌లో టాటా మోటార్స్, సుజుకీ మోటార్స్, ఎంజీ మోటర్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా ప్లాంట్లున్నాయి. అలాగే హర్యానాలో మారుతీ సుజుకీ, జార్ఖండ్‌లో టాటా మోటార్స్, కర్ణాటకలో టొయోటా కిర్లోస్కర్ ఉత్పాదక కేంద్రాలున్నాయి. ఇక మహారాష్ట్రలో మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, జాగ్వార్ ల్యాండ్ రోవర్, మెర్సిడెస్ బెంజ్, ఫోక్స్‌వ్యాగన్, స్కోడా ఆటో, హ్యుందాయ్ తయారీ కేంద్రాలున్నాయి. రాజస్థాన్‌లో హోండా కార్స్, తమిళనాడులోని చెన్నైలో బీఎండబ్ల్యూ, మహీంద్రా, హ్యుందాయ్, నిస్సాన్ మోటర్స్, రెనాల్ట్, డాట్సన్, సిట్రియాన్, బీవైడీ, ఏపీలో సుజుకీ మోటర్స్, కియా కార్లు తయారవుతున్నాయి.

వాణిజ్య

చికిత్స కోసం లక్ష రూపాయలు

విత్‌డ్రా పరిమితిని పెంచిన ఈపీఎఫ్‌వో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: ఉద్యోగుల భవిష్యనిధి ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌వో) శుభవార్తను అందించింది. వైద్య చికిత్స కోసం వారి ఖాతా నుంచి లక్ష రూపాయల వరకు విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని కల్పించింది. గతంలో రూ.50 వేలుగా ఉన్న ఈ గరిష్ఠ పరిమితిని రెండింతలు పెంచింది. ఇందుకు సంబంధించి ఈపీఎఫ్‌వో ఫారం 31లోని 68 జే కింద ఆటోమేటిక్‌గా క్లెయిం చేసుకునే అవకాశం కల్పిస్తూ సర్క్యులర్‌ను జారీ చేసింది. టీబీ, క్షయ, పక్షవాతం, క్యాన్సర్, గుండెకు సంబంధించిన రోగాలతో ఇబ్బందులు పడుతున్నవారు ఇందుకు అర్హులు. సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషన్ ఆమోదం పొందిన తర్వాత ఈ నూతన నిబంధనలు బుధవారం నుంచి అమలులోకి వచ్చాయి.

ఫారం 68-జే అంటే...

చికిత్స కోసం ఈపీఎఫ్‌వో సభ్యుడు ఈపీఎఫ్‌వో ఫారం 68-జే ద్వారా ముందస్తుగా నగదును ఉపసంహరించుకునే అవకాశాన్ని గతంలోనే కల్పించింది. ఇటీవల కాలంలో చికిత్స కోసం లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుండటంతో ఈ భారాన్ని తట్టుకోలేక ఎంతో మంది ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఉద్దేశంతో ఈపీఎఫ్‌వో ఈ పరిమితిని రెండింతలు పెంచింది. నెల అంతకంటే ఎక్కువ రోజుల పాటు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్న వారు ఈ మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చును. ఇందుకోసం ఉద్యోగి పలు సర్టిఫికెట్లు, చికిత్సకోసం అయ్యే ఖర్చు వివరాలను పొందుపరుచాల్సి ఉంటుంది. కానీ, వారి ఖాతాలో లక్షకు మించి ఉండాల్సిన అవసరం ఉన్నదని, అప్పుడే విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. అలాగే 68-ఎన్ ప్రకారం వికలాంగులు కొనుగోలు చేసే పరికరాలపై అడ్వాన్స్ రూపంలో విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని కూడా కల్పించింది.

ప్రయత్నించని రాష్ట్ర సర్కారు

ఆటోమొబైల్ రంగంలో తెలంగాణను మరింత అభివృద్ధి చేసే లక్ష్యంతో గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసింది. మెదక్‌లో రక్షణ రంగ వాహనాల పరిశ్రమ ఉండగా, జహీరాబాద్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, పటాన్‌చెరూలో డెక్కన్ ఆటోకు చెందిన కమర్షియల్ వాహనాలు తయారవుతున్నాయి. హ్యుందాయ్ కంపెనీ అదే ప్రాంతంలో టెస్టింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నది. దీంతోపాటు అనేక యాన్సిలర్ యూనిట్లు కూడా ఇక్కడ కొలువుదీరాయి. ఈ నేపథ్యంలో టెస్లా కార్ల తయారీ పరిశ్రమను రాష్ట్రానికి తేవడం ద్వారా అనేక ఇతర కంపెనీలను కూడా ఆకర్షించవచ్చని అప్పటి ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగానే టెస్లా కంపెనీ ప్రతినిధులతో అప్పటి మంత్రి కేటీఆర్ అమెరికాలో సమావేశమయ్యారు. అయితే కేంద్ర ప్రభుత్వ నిబంధనల వల్ల భారత్‌లో పరిశ్రమ ఏర్పాటుకు టెస్లా వెనుకడుగేసింది. ప్రస్తుత పరిస్థితులు మారడంతో సదరు కంపెనీ మన దేశంలో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. అయితే ఈ మేరకు చొరవ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనిపించడం లేదని ఆటో రంగ వర్గాలు అంటున్నాయి. టెస్లా వంటి పరిశ్రమలు రాష్ట్రానికొస్తే తెలంగాణ ప్రతిష్ఠ ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతుందని చెప్తున్నారు. ఆయా రాష్ట్రాల ప్రతినిధులు కంపెనీతో చర్చలు జరుపుతుంటే, మన రాష్ట్రం నుంచి అటువంటి ప్రయత్నం జరగడం లేదని వాపోతున్నారు.

మారనున్న రుణ నిబంధనలు

అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: ఆర్బీఐ ఆయా రుణాల నిబంధనల్ని మారుస్తున్నది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి పొందే వ్యక్తిగత, విద్య, వాహన తదితర రిటైల్ లోన్స్‌తోపాటు ఎంఎస్‌ఎంఈల లోన్లకు సంబంధించిన రూల్స్ ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి మారుతున్నట్టు ఆర్బీఐ చెప్తున్నది. వడ్డీరేటు, ఇతర త్రా ఖర్చుల గురించిన అన్ని వివరాలను రుణగ్రహీతలకు రుణదాతలు తప్పక అందజేయాల్సిందే. లోన్ అగ్రిమెంట్‌లో ఉండే భాష కూడా సరళంగా ఉండనున్నది. సంస్థాగత రుణాలకు వసూలు చేసే బీమా, లీగల్ ఫీజులకు సంబంధించిన మొత్తాలనూ లోన్ అగ్రిమెంట్లలో పేర్కొనాల్సిందే. వార్షిక పర్సంటేజ్ రేట్ (ఏపీఆర్)లో థర్డ్ పార్టీ సర్వీస్ ప్రొవైడర్లూ భాగమే అవుతారు. కీ ఫ్యాక్ట్ స్టేట్‌మెంట్ (కేఫ్‌ఎస్)లో పేర్కొనని ఏ చార్జీలనైనా రుణగ్రహీతల అనుమతి, అంగీకారాలతోనే రుణదాతలు తీసుకోవాల్సి ఉంటుందని ఆర్బీఐ చెప్పింది. అయితే క్రెడిట్ కార్డుల విషయంలో మాత్రం ఈ కొత్త నిబంధనలు వర్తించబోవన్నది.

స్మార్ట్ కీతో యమహా సరికొత్త స్కూటర్

చెన్నై, ఏప్రిల్ 17: దేశీయ మార్కెట్‌కు సరికొత్త మాడల్‌ను పరిచయం చేసింది యమహా మోటర్. స్మార్ట్ కీతో రూపొందించిన 'ఏరోక్స్ 155 వెర్షన్ ఎస్' మాడల్ రెండు రంగుల్లో లభించనున్నది. ఈ స్కూటర్ ధర రూ.1,50,600గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి.155 సీసీ సామర్థ్యంతో బ్లూ కోర్ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు సీవీటీ ట్రాన్స్‌మిషన్, 4-స్ట్రోక్, 4-వాల్వ్స్ మోటర్ ప్రొడ్యుస్‌తో 15 పీసీల శక్తినివ్వనున్నది.

సామ్‌సంగ్ ఐవోటీ-టీవీలు

ప్రారంభ ధర రూ.1.39 లక్షలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీలో అగ్రగామి సంస్థయైన సామ్‌సంగ్..కృత్రిమ మేధస్సుతో తయారైన స్మార్ట్ టీవీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. కృత్రిమ మేధస్సు అల్ట్రా-ప్రీమియం నియో క్యూలెడ్ టీవీలు ప్రారంభ ధర రూ.1.39 లక్షలు, ఒలెడ్ టీవీ ప్రారంభ ధర రూ.1.64 లక్షలుగా నిర్ణయించింది. ఈ సందర్భంగా సామ్‌సంగ్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోహన్‌దీప్ సింగ్ మాట్లాడుతూ.. దేశీయంగా ప్రీమియం టీవీలకు పెరుగుతున్న డిమాండ్‌తో ఈ ఏడాది టీవీలను విక్రయించడంతో రూ.10